# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రైతుల్ని ప్రకృతి వ్యవసాయం పరిధిలోకి తెచ్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేపు ఆర్గానిక్ కుప్పం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.**

**2. ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ రోజు సమీక్ష నిర్వహించారు.**

**3. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించబోమని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు.**

**4. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, శిక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

**5. అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతుల్ని ప్రకృతి వ్యవసాయం పరిధిలోకి తెచ్చే లక్ష్యంతో 'ఆర్గానిక్ కుప్పం' పేరుతో పదేళ్ల ప్రణాళికను ఏపీ రైతు సాధికార సంస్థ అమలు చేయనుంది. కుప్పం నియోజకవర్గంలోని శీగలపల్లెలో చంద్రబాబునాయుడు రేపు 'ఆర్గానిక్ కుప్పం' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలోని నూరుశాతం రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరించేలా పదేళ్ల ప్రణాళికను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా పలు ఆర్గానిక్ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశమవుతారు.

-------------------------

ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఈ ఉదయం నిర్వహించిన సమీక్షలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మంత్రులు, పలువురు శాసనసభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ఎలాంటి

ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల నుంచి విశాఖపట్నం వచ్చే వారికి రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి పాల్గొనే సభకు సుమారు 3లక్షల మంది హాజరయ్యే అవకాశముందని అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వివరిస్తూ ..

..వాయిస్...25 సెకన్లు

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థులకు 90 వేల కళ్లద్దాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ ఆదేశించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద అమలవుతున్న కార్యక్రమాలపై గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గాల స్థాయిలో శాసనసభ్యుల ఆధ్వర్యంలో కళ్లద్దాలను పంపిణీ చేయాలని సూచించారు. 45 ఏళ్లు పైబడిన గ్రామీణులందరికీ ఉచిత కంటిపరీక్షలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను సత్యకుమార్ ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించబోమని హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. గత ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిందని ఆమె విమర్శించారు. విశాఖపట్నం కేంద్ర కారాగారంలో ఖైదీల వద్ద నిన్న సెల్ ఫోన్ కనిపించిందన్న ఆరోపణలతో ఆమె ఈరోజు కారాగారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. జైలులో గంజాయి వినియోగిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయని తెలిపారు. విశాఖ జైలులో ఘటనలపై కమిటీ వేశామని.. పది రోజుల్లో నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెూంమంత్రి పేర్కొంటూ...

.....వాయిస్.... 27 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు 2024లో 617 పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 3వేల మందికిపైగా జనాభా ఉన్న 4 వేల 604 గ్రామ పంచాయతీలకు భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వగా.. అందులో అరుణాచల్ ప్రదేశ్‌కు 661, ఆ తర్వాత అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు 617 భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని పేర్కొంది. అలాగే వెయ్యా 422 కంప్యూటర్లు ఇచ్చామని ఒక ప్రకటనలో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ తెలిపింది.

---------------------------

అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని మంత్రి నివాసంలో ఈ రోజు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధితులు ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు.

---------------------------

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, శిక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉద్యోగకల్పనలో భాగంగా ఈరోజు సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్ప పథకం కింద నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలో ఇలాంటి మెగా జాబ్ మేళాలను నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగకల్పన, శిక్షణ అందిస్తోందని చెప్పారు. నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి ఆకాంక్షించారు.

---------------------------

స్థానికులు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా దర్శన టోకెన్లను తిరుమల తిరుపతి దేవస్థానం..టీటీడీ ఈ రోజు జారీ చేసింది. తిరుపతిలోని మహతి ఆడిటోరియం, తిరుమలలోని బాలాజీనగర్ కమ్యూనిటీ హాలులో ఈ టోకెన్లను జారీ చేశారు. ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనాన్ని కల్పించాలని.. టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించిన అనంతరం, గత నెల నుంచి స్థానికులకు టోకెన్లు జారీ చేస్తున్నారు. ఈ రోజు టోకెన్లు పొందిన తిరుపతి ప్రజలకు మంగళవారం శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి అనుమతిస్తారు.

---------------------------

జాతీయ పక్షుల దినోత్సవాన్ని ఈరోజు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. పక్షుల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వివిధ పక్షి జాతులు అంతరించిపోకుండా చేపట్టవలసిన చర్యల గురించి ఈ సందర్భంగా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 10 వేలకుపైగా పక్షిజాతులు ఉండగా... నానాటికి మారుతున్న వాతావరణ పరిస్థితులతో పాటు వివిధ కారణాల వల్ల పక్షిజాతులు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పక్షుల సంరక్షణ కోసం ప్రజలను కార్యోన్ముఖులను చేసే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం జనవరి 5వ తేదీన జాతీయ పక్షుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏటా నిర్వహించే పరీక్షా పే చర్చ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. ప్రధానమంత్రితో మాట్లాడేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు innovativeindia1.mygov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపింది. ఇందుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు విధించింది. పరీక్షా పే చర్చ తేదీని త్వరలోనే వెల్లడిస్తామని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది.

---------------------------

ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం.. షార్ నుంచి స్పెడెక్స్ ప్రయోగం చేపట్టిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో మరో అద్భుత ఘనత సాధించింది. కంపాక్ట్ రీసెర్చ్ మాడ్యూల్ ఫర్ ఆర్బిటల్ ప్లాంట్ స్టడీస్.. క్రాప్స్ పేరిట పీఎస్ఎల్వీ–సీ 60 వాహకనౌకలో ఇస్రో ఒక పేలోడ్‌ను అంతరిక్షంలోకి పంపింది. అందులో 8 అలసంద విత్తనాలను ఉంచింది. ప్రయోగం చేపట్టిన తర్వాత నాలుగు రోజుల్లో అవి మొలకెత్తాయని ఇస్రో వెల్లడించింది. అంతరిక్షంలో జీవం మొలకెత్తింది అని, త్వరలో ఆకులు కూడా వస్తాయని ఎక్స్‌లో ఇస్రో పేర్కొంది.

--------------------------

ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు వీలుగా విశాఖ ఉక్కు పరిశ్రమకు పన్నుల విరామాన్ని ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం .. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యక్షంగా సొంత బొగ్గు .. ఖనిజ గనులను కేటాయించాలని ఎక్స్‌లో ఆమె డిమాండ్ చేశారు. సొంత గనులను కేటాయిస్తే విశాఖ ఉక్కు పరిశ్రమ భవిష్యత్తుపై అనుమానం ఉండదని షర్మిలా రెడ్డి తెలిపారు.

======================